క్లుప్తంగా

కిరాణా దుకాణాల్లో తనిఖీలు


మేదరిపేటలో తనిఖీ చేస్తున్న అధికారులు

దండేపల్లి/జన్నారం: కిరాణా దుకాణాల్లో అటవీశాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దండేపల్లి మండలకేంద్రంతో పాటు మేదరిపేట గ్రామంలో, జన్నారం మండలకేంద్రంతో పాటు కిష్టాపూర్ గ్రామాల్లో చైనాకు చెందిన మాంజాదారం, పతంగులు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మాంజా దారాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, కాబట్టి వాటిని విక్రయించొద్దని, విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో దండేపల్లిలో డీఆర్వో పోచమల్లు, ఎఫ్ఎస్ఓ శేషరాం, ఎఫ్‌బీఓ శ్రావణ్, జన్నారంలో బీట్ అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28నుంచి టీజీబీ సేవల్లో అంతరాయం

దండేపల్లి: ఈ నెల 28నుంచి 31వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)సేవలకు తాత్కాలిక అంతరాయం ఉంటుందని దండేపల్లి బ్రాంచి మేనేజర్ భూమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్(ఏపీజీవీబీ)బ్యాంకును, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నారు. దీని కారణంగా టీజీబీ సేవల్లో అంతరాయం ఉంటుందని, తిరిగి 2025 జనవరి1 నుంచి బ్యాంకు సేవలు యధావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

మార్కెటింగ్ విధానాల పత్రాలు దహనం

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అగ్రి మార్కెటింగ్ కొత్త విధానం ముసాయిదాను ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ముసాయిదా పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మల్లేష్, రాజన్న, సత్తన్న, సుమన్, రాజన్న పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామి వర్ధంతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం పెరియార్ రామస్వామి 51వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి సత్యనారాయణ, బీసీ ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవి పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

రామకృష్ణాపూర్/మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట/పాతమంచిర్యాల: క్రైస్తవులకు అత్యంత ప్రీతికరమైన పండగ అయిన క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తళుకుతళుకుమనే తారలతో, విద్యుత్ దీపాల అలంకరణలతో పట్టణంలోని ఆయా చర్చీలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులు సంవత్సరానికి ఒకసారి జరుపుకునే ఏకైక ప్రధాన పండగ కావడంతో అన్ని చర్చీలతో పాటు క్రైస్తవుల ఇళ్లు కూడా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసుకున్నారు. ఏసుక్రీస్తు పుట్టినప్పుడు ఉన్న సందర్భాన్ని పోలిఉండే పశువుల పాకను మందిరాలల్లో ఏర్పాటు చేశారు. రెండు వేల సంవత్సరాల క్రితం ఈ లోకంలో జన్మించిన ఏసుక్రీస్తు.. ప్రేమామయుడిగా, కరుణామయుడిగా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న విధానాన్ని, ఆయన జీవన శైలిని పాస్టర్లు తమ దైవ సందేశాల ద్వారా బోధించనున్నారు. బుధవారం వేకువజాము నుంచి రాత్రి వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయా చర్చీల పాస్టర్లు తెలిపారు. ప్రత్యేక గీతాలు, దైవ సందేశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


సాక్రీడ్‌హార్ట్ చర్చిలో అలంకరణ


హమాలీవాడ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు


క్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక


లక్సెట్టిపేటలో ముస్తాబైన చర్చి


సాక్రీడ్ హార్ట్ రోమన్ క్యాథలిక్ చర్చిలోని పశువుల పాక


మంచిర్యాలఅర్బన్: సీఎస్ఐ చర్చి

కొనసాగుతున్న టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

మంచిర్యాలటౌన్: జిల్లాలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉద్యోగులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సభ్యత్వం తీసుకున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలోని 20 మంది, హెచ్‌డబ్ల్యూవోలు 15 మంది సభ్యత్వం తీసుకున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ప్రణవానంద్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

మాదారం ఠాణాను సందర్శించిన డీసీపీ

తాండూర్:మాదారం పోలీసు స్టేషన్‌ను డీసీపీ ఎ.భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి పోలీసు స్టేషన్‌కు వచ్చిన డీసీపీ ఠాణాలోని పరిసరాలను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై అధికారులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో క్రైం రేట్ ఎలా ఉంది.. గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులను ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. డీసీపీ వెంట తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

గుడుంబా స్థావరాలపై దాడులు

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట, కొత్తూర్, నెన్నెల లంబాడితాండలపై మంగళవారం చెన్నూర్ ఎక్సైజ్, నెన్నెల పోలీసులు కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సమ్మయ్య, నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో గ్రామ శివారుల్లో దాచిపెట్టి డ్రమ్ముల్లో, కుండల్లో పాతి పెట్టిన వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20లీటర్ల నాటుసార (గుడుంబా) స్వాధీన పర్చుకున్నారు. గ్రామాల్లో గుడుంబా విక్రయించిన, తయారు చేసిన పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై వెంకటేష్, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

'నర్సింగాపూర్‌ను కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నర్సింగాపూర్ గ్రామాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దంటూ మంగళవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, జిల్లా నాయకుడు బొలిశెట్టి తిరుపతి, బూత్ అధ్యక్షుడు మెండు తిరుపతి, నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని రేచిని గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.3కోట్లతో నిర్మించే బీటీ రోడ్డుకు, రూ.5లక్షల అంచనాతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ.25లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించడానికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యేకు ఫొటో, వీడియోగ్రాఫర్లు విన్నవించారు. అనంతరం మహేందర్‌రావు ఇంట్లో కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చర్చించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం దామోదర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టుమురళీధర్ రావు, అధికారులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

పరామర్శ

భీమిని: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దారిశెట్టి వెంకన్న కుటుంబాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం పరామర్శించారు.

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి తిరుపతిరెడ్డిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం పరామర్శించారు. తిరుపతిరెడ్డి తండ్రి ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ముత్తయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు తోట శ్రీనివాస్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ పోస్టుమెట్రిక్ భవనం ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తగా రూ.కోటి అంచనాతో నిర్మించిన ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే గడ్డం వినోద్ లాంఛనంగా ప్రారంభించారు. ఆ తర్వాత నూతన భవనంలోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఓ క్రికెట్ అకాడమీని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

సమ్మెలో ఉద్యోగులు.. తెరుచుకోని కార్యాలయం

దండేపల్లి: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని 15 రోజులుగా సమ్మె చేస్తూ జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్నారు. విధులకు హాజరు కావడం లేదు. దీంతో మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం తెరుచుకోక, తాళం వేసి ఉంది. ఎంఐఎస్, సీసీవో, సీఆర్పీలు, మెసెంజర్ అందరూ సమ్మెలో పాల్గొనడంతో, మధ్యాహ్న భోజన బిల్లులు, ఆన్‌లైన్ నమోదు తదితర పనులు నిలిచిపోయాయి. కేజీబీవీ, భవిత కేంద్రాల్లో బోధన జరగడం లేదు.


తెరుచుకోని ఎమ్మార్సీ కార్యాలయం

సర్వేకు సర్వర్ సమస్య



మంచిర్యాల జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సర్వర్ బిజీతో యాప్

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జాప్యం
- వివరాల నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యదర్శులు
- ఈ నెలాఖరు వరకు గడువు


దండేపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

దండేపల్లి/కోటపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇందిరమ్మ యాప్ సర్వర్ మొరాయిస్తుండటంతో దరఖాస్తుదారుల వివరాల నమోదులో ఆలస్యం అవుతోంది. సర్వే యాప్ అప్డేట్ అయ్యాక సర్వేయర్లు మరిన్ని ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తొలుత ఒక్కో సర్వేయర్ రోజుకు దాదాపు 30కుటుంబాల వరకు సర్వే చేయగా.. సాంకేతిక సమస్యలతో ఇప్పుడు 25కుటుంబాల వివరాలు నమోదు చేయటమే గగనంగా మారిందని పలువురు సర్వేయర్లు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,05,939మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లాలోని 16మండలాల్లోని 311గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, జిల్లాలోని 7మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు ఇందిరమ్మ యాప్‌ల ద్వారా సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 79,116దరఖాస్తుల సర్వే పూర్తి కాగా 38శాతం సర్వే మాత్రమే పూర్తయ్యింది. ఈ నెల 31వ తేదీలోగా అంటే వారం రోజుల్లో 62శాతం సర్వే జరిపి 100శాతం చేరుకోవాల్సి ఉంది. యాప్ సర్వర్ బిజీ వస్తుండటతో సర్వే నెమ్మదిగా సాగుతోంది.

సర్వేలో కార్యదర్శులకు పలు సమస్యలు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేస్తున్న సిబ్బందికి క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సొంతస్థలం ఉన్నా డాక్యుమెంట్లు లేకపోవడం, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉండకపోవడంతో యాప్‌లో అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. రోజూ కనీసం 20ఇళ్ల వివరాలు కూడా సేకరించలేకపోతున్నామని కార్యదర్శులు, వార్డు అధికారులు వాపోతున్నారు.

ఇల్లున్న వాళ్లే దరఖాస్తు....

కొందరికి సొంత ఇల్లు ఉన్నప్పటికీ, లేదని పేర్కొంటూ ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేకు వెళ్లిన కార్యదర్శులు దరఖాస్తుదారులకు సొంతిల్లు ఉన్నట్లు గుర్తిస్తున్నారు. మరికొందరు సొంతింట్లో ఉన్నప్పటికీ అద్దె ఇల్లులో ఉంటున్నామని కార్యదర్శులతో చెబుతున్నారు. ఇంటిఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఒప్పుకోవడంలేదు. ఫొటో అప్‌లోడ్ చేస్తే కొత్త ఇల్లు మంజూరు కాదంటూ కార్యదర్శులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, ఇల్లు లేదని వివరాలు నమోదు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. సర్వేకు మారుమూల ప్రాంతాల్లో సర్వేకు వెళ్లినప్పుడు చాలాచోట్ల నెట్‌వర్క్ సమస్యలు తలెత్తున్నాయని కార్యదర్శులు వాపోతున్నారు. దీంతో అధికారులు నెట్‌వర్క్ సమస్య ఉన్న చోట కూడా యాప్‌ను అందుబాటులో తెచ్చేలా ఆఫ్‌లైన్‌లో కూడా యాప్ తీర్చిద్దారు. అయినా అప్‌లోడ్ చేసేందుకు యాప్‌తో ఇబ్బంది పడుతున్నామని మారుమూల ప్రాంతాల కార్యదర్శులు తెలిపారు.

జాప్యానికి కారణాలు ఇవి..

- పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు దరఖాస్తుదారుడు తప్పనిసరిగా ఉండాలి. ఇల్లు నిర్మించే ప్రదేశంలో దరఖాస్తుదారుడి ఫొటో తీయాల్సి ఉంటుంది. కానీ చాలామంది ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు.
- నివాసం ఉండేది ఒకచోట, అయితే ఇల్లు నిర్మించుకునే స్థలం మరోచోట ఉండటంతో ఆలస్యం అవుతోంది.
- ఇంటి నిర్మాణం ప్రతిపాదిత స్థలానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పట్టా, సాదా, సేల్‌డీడ్, రిజిస్టర్ సేల్‌డీడ్, జీవో 58, పొజిషన్ సర్టిఫికేట్, ఆస్తి పన్ను రశీదు, విద్యుత్ బిల్లులో ఏదో ఒకటి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి కానీ చాలామంది వద్ద సర్టిఫికెట్లు లేవు.

ఇబ్బందులు పర్యవేక్షిస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వర్ సమస్యలతో కొన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్యతో సర్వేలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సర్వే సజావుగా సాగేలా సాంకేతిక నిపుణుల సాయంతో ముందుకు సాగుతున్నాం. సమయానికి సర్వే పూర్తి చేసేలా సర్వే బృందాలకు సాంకేతిక బృందం అందుబాటులో ఉంటుంది.

– వెంకటేశ్వర్‌రావు, డీపీవో, మంచిర్యాల

సంక్షిప్త వార్తలు

పేకాటస్థావరంపై దాడి

నెన్నెల: నందుపల్లి శివారు మామిడి తోటలోని పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఇద్దరిని పట్టుకోగా మరో నలుగురు పారిపోయారన్నారు. వారి నుంచి రూ.3వేల నగదు, మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

పాతమంచిర్యాల: వినియోగదారులు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంభావ్ అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజిలెన్సు యాంటి కరప్షన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ దుర్గం వెంకటస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సోషల్ డిటెక్టివ్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్: సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల నియమించబడిన టీబీజీకేఎస్ ఎస్సార్పీ 3, 3ఏ, ఆర్కే న్యూటెక్ గనుల పిట్ కమిటీల నాయకులు, గనుల అధికారులతో మంగళవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్)రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని బీఎంఎస్ 19వ త్రైవార్షిక మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఫిబ్రవరి 22, 23తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే త్రైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజేందర్, ప్రభాకర్, శ్రీకాంత్, పురుషోత్తమ చారి పాల్గొన్నారు.

గుడికి రూ.లక్ష విరాళం

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న విశ్వేశ్వర అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన తిరుమల్ల పోశన్న –విమల దంపతులు రూ.లక్ష 16వేలు విరాళంగా అందజేశారు.